క్లుప్తంగా

ఘనంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాశికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలతో అమ్మవారికి అష్టాదళ పాదపద్మారాధన సేవ చేశారు. కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వైరింగ్ కోర్సుపై ముగిసిన శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం, గణిత శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులకు ఇంటి ఎలక్ట్రికల్ వైరింగ్‌పై శిక్షణ ముగిసింది. దాదాపు 37 మంది విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకోవడంతో వారికి మంగళవారం సర్టిఫికెట్లు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు.

పకడ్బందీగా భూ రీసర్వే



బీరవోలులో భూ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ విశ్వనాథ్

రుద్రవరం: భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ విశ్వనాథ్ అన్నారు. మండల పరిధిలోని బీరవోలులో గత కొద్ది రోజులుగా భూ రీసర్వే పనులు సాగుతున్నాయి. మంగళవారం ఆయన ఆ పనులను పరిశీలించి మాట్లాడారు. ఒక్కో బృందం రోజుకు 20 ఎకరాలు మాత్రమే రీసర్వే చేయాలని చెప్పామన్నారు. గ్రామానికి రెండు బృందాలను నియమించామని వెల్లడించారు. ఆయన వెంట తహసీల్దారు మల్లిఖార్జునరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బహుమతుల పంపిణీ



నంద్యాల(న్యూటౌన్):ప్రజ్ఞా వికాస్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు బహుమతులు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చాల్సిన బాధ్యత పిల్లలపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి



కట్ సెక్షన్ ఇంజన్‌ను అందజేస్తున్న ఇసుజు మోటార్స్ ఇండియా ప్రతినిధులు

నంద్యాల(న్యూటౌన్):విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని ఇసుజు మోటార్స్ ఇండియా హెచ్ఆర్ ప్రదీప్, మురళీ సూచించారు. నంద్యాల ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మంగళవారం వారు సందర్శించారు. మెకానికల్ విభాగం ప్రయోగశాలకు రూ. 3 లక్షలు విలువ చేసే కట్ సెక్షన్ ఇంజన్‌ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్, ట్రిపుల్‌ఈ, సివిల్, మెకానికల్, జనరల్ సెక్షన్ విభాగాధిపతులు రాజేష్, శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి, సంజీవరాయుడు, డాక్టర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న బ్యాంక్ ఉద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని, లేని పక్షంలో ఈనెల 24, 25 తేదీల్లో సమ్మెకు వెళ్తామని యూనైటెడ్ ఫోరం బ్యాంక్ యూనియన్ నాయకులు, ఉద్యోగస్తులు మంగళవారం నంద్యాల రీజియన్ ప్రాంతీయ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పరదేశి కిరణ్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకింగ్ విధానాలకు అనుగుణంగా బ్యాంకుల్లో నియామకాలు చేపట్టి ఉద్యోగులకు పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూఎఫ్‌డీయూ నాయకులు రాజేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం



నంద్యాల పట్టణంలోని రెవెన్యూ క్వార్టర్స్‌లో హిందూ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అహోబిలం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈ వేడుకను తిలకించేందుకు తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నంద్యాల(వ్యవసాయం)

గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన



పండకండ్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐదోఅదనపు జిల్లా జడ్జి మురళీక్రిష్ణ హాజరై గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులతో చనువుగా ఉండరాదని సూచించారు. ఎవరైనా బాలికలు లైంగిక వేధింపులకు గురైతే వెంటనే తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ప్యానెల్ లాయర్స్ షాహినాబేగం, సుబ్బయ్య, మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

సర్కారు దగాపై 'యువత పోరు'



ఎన్నికల ముందు విద్యార్థులు, నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిన కూటమి సర్కారుపై వైఎస్సార్‌సీపీ యువత పోరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నేడు జిల్లా కేంద్రం నంద్యాలలో జరిగే ఈ కార్యక్రమాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ ఉయ్యాలవాడ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి యువత పోరు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ మెంబర్ అమీర్ అహమ్మద్, మాజీ గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ

'పది' ప్రశ్నపత్రాలు వచ్చేశాయ్



ఈనెల 17 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రశ్నపత్రాలు దొర్నిపాడు, రుద్రవరం మండల కేంద్రాలకు చేరుకున్నాయి. వాటిని పరీక్షల నిర్వాహకులు, విద్యాధికారులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి భద్ర పరిచారు. సోమవారం మొదటి సెట్ రాగా, మంగళవారం రెండోసెట్ వచ్చినట్లు ఆయా మండలాల్లోని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు విద్యాధికారులు తెలిపారు.

దొర్నిపాడు/రుద్రవరం

ఉపాధి కల్పనలో లక్ష్యాన్ని అధిగమించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పని కల్పించడంలో నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఏపీడీలు, ఎంపీడీఓలకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొమ్మిది లక్షల పని దినాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. 80 నుంచి 90 రోజుల పని దినాలకు చేరువలో ఉన్న కుటుంబాలకు గుర్తించి వంద రోజులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు, చాగలమర్రి, కొత్తపల్లి, రుద్రవరం, అవుకు తదితర 9 మండలాలు లేబర్ బడ్జెట్‌లో వెనుకబడి ఉన్నాయని చెప్పారు. 100 రోజుల పని దినాల లక్ష్యంలో జిల్లా 13వ స్థానంలో ఉందని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య, హౌసింగ్ ఈఈ హరిహర గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



దస్తగిరి ఉరుసుకు ముస్తాబు

చాగలమర్రి: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో దస్తగిరిస్వామి ఉరుసు నేటి నుంచి ప్రారంభంకానుంది. బుధవారం గంధం, గురువారం ఉరుసు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా వద్ద ఏర్పాట్లు చేశారు. ఏటా ఉరుసుకు గ్రామానికి చెందిన షబ్బీర్ అనే వ్యక్తి దర్గా పక్కనే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఈసారి కూడా అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శాంతిప్రియ

నంద్యాల(న్యూటౌన్): మహిళల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ, యూ టీఎఫ్, ఐద్వా నాయకురాలు శాంతిప్రియ, నాగమణి, రమణకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో మహిళల హక్కులకై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళలు దేశంలో లైంగిక, సామాజిక, ఆర్థిక దోపిడీకి గురవుతున్నారన్నారు. మహిళలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళల గురించి పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్యకర్తలు, శ్రామిక మహిళలు వారి సమస్యలపై ఆందోళనలు చేస్తున్నా సర్కాకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు సుజాత, సావిత్రి, సుశీలమ్మ, విజయరాణి, వెంకటలక్ష్మి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

అభిరుచి మధు మత విద్వేశాలు సృష్టిస్తున్నారు



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

నంద్యాల(న్యూటౌన్): బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు మతవిద్వేశాలు సృష్టిస్తున్నారని, ఆయనను పార్టీ హైకమాండ్ చర్యలు తీసుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, ప్రజా పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమల్ల రహీం, జాను జాగో జాతీయ కార్యదర్శి మహబూబ్‌బాషా, చిరువ్యాపార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో హిందూ ముస్లిం, క్రిష్టియన్లు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తున్నారన్నారు. అయితే, తాజాగా అభిరుచిమధు పట్టణంలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా మాట్లాడారన్నారు. వెంటనే ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోలీసులు ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నంద్యాల(అర్బన్): బీసీ హాస్టల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించాలని, అందుకు తగిన సదుపాయాలు, మార్గదర్శకాలను వసతి గృహాల సంక్షేమ అధికారులు కల్పించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారిణి లక్ష్మీదేవి అన్నారు. స్థానిక బీసీ హాస్టల్‌లో మంగళవారం జిల్లా స్థాయి బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్యూటర్స్ ద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని, వారికి నమూనా పరీక్షలు నిర్వహించి మెయిన్ పరీక్షలకు మానసికంగా సన్నద్ధం చేయాలన్నారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. వార్డెన్లు ఓబులేసు, గోపాల్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు వివరాలు సరి చూసుకోవాలి

గోస్పాడు: రబీ సీజన్‌కు సంబంధించి గోస్పాడు మండలంలో రైతులు సాగు చేసిన పంట నమోదు వివరాలను సరిచూసుకోవాలని వ్యవసాయ అధి కారి స్వప్నికారెడ్డి సూచించారు. మంగళవారం పసురపాడు, గోస్పాడు రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన ఈ పంట ముసాయిదా జాబితాను పరిశీలించి మాట్లాడారు. రైతుల పరిశీలన నిమిత్తం అన్ని రైతు సేవ కేంద్రాల్లో ఈనెల 20వ తేదీ వరకు జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. అందులో ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. 4,507మంది రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ, సిబ్బంది ఆయూబ్ బాషా పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లకు దరఖాస్తు చేసుకోండి



ఆర్.జంబులదిన్నె ఆర్‌బీకేలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ : యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ పనిముట్లు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆర్. జంబులదిన్నె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి అనంతరం ఆర్‌బీకేలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాటరీ స్ప్రేయర్ 9 యూనిట్లు, పవర్ స్ప్రేయర్లు 22, ట్రాక్టర్ పనిముట్లు 28 యూనిట్లు, రోటావేటర్ 1, గడ్డి కోత యంత్రం 1 యూనిట్ మంజూరయ్యాయన్నారు. వీటి కోసం ప్రభుత్వం మండలానికి రూ. 10.42 లక్షలు కేటాయించిందన్నారు. మార్చి 31వ తేదీలోగా ఆయా రైతు సేవా కేంద్రాల్లో వీఏఏల వద్ద దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రాణెమ్మ, వీఏఏ భార్గవి పాల్గొన్నారు.

పీ-4 సర్వే వేగవంతం చేయండి

రుద్రవరం: పీ - 4 సర్వేను వేగవంతం చేయాలని డీడీఓ శివారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి వివిధ శాఖల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఓ మాట్లాడుతూ సిటిజన్ మిస్సింగ్ డేటా, అలాగే ఎంప్లాయిస్ మిస్సింగ్ డేటా, ఎంఎస్ఎంఈ, చిన్నారుల ఆధార్, వర్క్ ఫ్రం హోం, పీ-4 సర్వేలను సక్రమంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

కుట్టు శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

దొర్నిపాడు: మండలంలోని బీసీ, ఓసీ కులాలకు చెందిన పేదింటి మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ, మిషన్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తుదారులు 20 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు కల్గి, రూ.1.50లక్షల వరకు ఆదాయం కల్గి ఉండాలన్నారు. దివ్యాంగులు, వితంతువులకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. అర్హులు ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటో, ఫోన్‌నెంబర్‌తో సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): గ్రామీణ, పట్టణప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 13వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరై దాదాపు 230మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు.

వైద్య సేవలు అందడం లేదు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పేదలకు వైద్య సేవలు అందడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రికి కొత్త వైద్యులు వచ్చారు కాని రోగులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. గుండె సంబంధ సమస్యలకు సేవలందించేందుకు వైద్యులే లేరన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి వైద్యాధికారులు, సూపరింటెండెంట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో రైతులకు ప్రయోజనం



పెద్దబోధనంలో రైతులకు పంటల సాగుపై సూచనలిస్తున్న ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

చాగలమర్రి: పంట మార్పిడి ద్వారా రైతులకు ప్రయోజనం ఉంటుందని ఆళ్లగడ్డ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి రంగనేతాజి ఆధ్వర్యంలో నేలంపాడు, పెద్దబోధనం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పాల్గొని మాట్లాడారు. ఎక్కువగా ఈ ప్రాంతంలో మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నారని చెప్పారు. పంట మార్పిడి చేయకపోతే ఆశించిన మేర దిగుబడులు రావని చెప్పారు. మొక్కజొన్న పంట అధిక శాతంలో పోషకాలను గ్రహిస్తున్నందున మినుము, పెసర, కంది వంటి పంటలు మార్పిడి చేసి సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. అదే విధంగా ఈ పంట నమోదు చేసుకున్న రైతులు తమ వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో సరిచూసుకోవాలన్నారు. ఏఓ రంగనేతాజి రైతు విశిష్ట సంఖ్య ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అభ్యంతరాలుంటే తెలపాలి

దొర్నిపాడు: రబీలో సాగుచేసిన పంటలకు నమోదైన ఈ-క్రాప్ పై అభ్యంతరాలుంటే తెలపాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల తెలిపారు. మంగళవారం మండలంలోని అర్జునాపురం, దొర్నిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఈ-క్రాప్ నమోదు వివరాలను రైతులకు చూపించారు. ఏమైనా తప్పుగా నమోదు అయింటే సవరణ చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఈ-క్రాప్ అనంతరం తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మల్లికార్జున, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమపై ఎన్‌డీఏ ప్రభుత్వం వివక్ష



మాట్లాడుతున్న బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(అర్బన్): రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన రాయలసీమ అభివృద్ధికి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. సీమ సమగ్రాభివృద్ధికి పాలకులపై ఒత్తిడి పెంచే దిశగా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో మంగళవారం మే 31న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవ నిర్వహణపై సమితి ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణానది యాజమాన్య బోర్డు కర్నూలులోనే ఏర్పాటు చేయాలని, దాదాపు రూ.1000 కోట్లు సీమ ప్రాంతానికి బడ్జెట్ కేటాయించి పనులు చేపడితే 4.50లక్షల ఎకరాల ఆయకట్టు ఖరీఫ్ సీజన్‌కు స్థిరీకరణ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆర్ఏఆర్ఎస్ నుంచి కలెక్టరేట్ కార్యాలయాన్ని తొలగించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. విద్య, వైద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సాగునీరు, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న వివక్షపై ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా కార్యాచరణ చేపడతామన్నారు. మానవ వనరుల శిక్షకులు గజ్జెల రవీంద్రర్‌రెడ్డి మాట్లాడుతూ సీమ కార్యాచరణ విజయవంతం కావడానికి అనేక అవాంతరాలను అధిగమించాల్సి ఉందన్నారు. ప్రతి ప్రతినిధి ఒక ఉద్యమ నాయకుడిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు సీమకు జరిగిన అన్యాయాన్ని ఇంటింటికి తెలియజేసి కార్యాచరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వైఎస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పట్నం రాముడు పాల్గొన్నారు.

తల్లి హత్య కేసులో కుమారుడి అరెస్ట్

ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో మద్యం మత్తులో కన్నతల్లిని హత్యచేసిన కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఈ విషయాన్ని వెల్లడించారు. గ్రామంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న బాల గురప్ప అలియాస్ బాలగురువయ్య చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. సోమవారం మద్యం మత్తులో తల్లి అంబటి చిన్న పుల్లమ్మపై రోకలిబండతో తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందారు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని మండలంలోని మాయలూరు గ్రామ సమీపంలో జమ్మలమడుగు రస్తాలో మంగళవారం అరెస్ట్ చేశారు. నిందితుడిని కోవెలకుంట్ల కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ వెల్లడించారు.

వైభవంగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు





జ్వాలానరసింహస్వామి, చెంచులక్ష్మిని పెళ్లి మంటపానికి తీసుకొస్తున్న పీఠాధిపతి, అర్చకులు, కల్యాణ మహోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

- వేణుగోపాల స్వామి అలంకరణలో అలరించిన ప్రహ్లాదవరదుడు
- రాత్రి పొన్నచెట్టు వాహనం అధిష్టించి భక్తులకు కనువిందు
- ఎగువ అహోబిలంలో గజవాహనంపై ఊరేగిన జ్వాలానరసింహుడు

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాలు భక్తుల గోవిందా నామస్మరణతో మార్మోగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన మంగళవారం దిగువ అహోబిలంలో కొలువైన శ్రీ ప్రహ్లాద వరదస్వామి వేణుగోపాల స్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామున నిత్య పూజల్లో భాగంగా సుప్రభాత సేవతో స్వామిని మేలుకొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఉభయ దేవేరులతో ఉత్సవ పల్లకీని అధిరోహించిన ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో సందడి చేస్తూ భక్తులను కనువిందు చేశారు. అనంతరం గుడికి చేరుకున్న ఉత్సవ మూర్తులను పూల ఊయలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అభిషేకం నిర్వహించా రు. రాత్రి పొన్నచెట్టు వాహనంపై కొలువై దర్శనమిచ్చారు.ఎగువ అహోబిలంలో కల్యాణోత్సవానికి ముందు పూజలు అందుకున్న ఉగ్రనరసింహస్వామి గజవాహనం అధిరోహించి భక్తులకు దర్శనం కల్పించారు.

జ్వాలానరసింహుడి కల్యాణం..కమనీయం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీ జ్వాలా నరసింహస్వామి , చెంచులక్ష్మీ అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం మంగళవారం ఎగువ అహోబిలంలో వైభవోపేతంగా నిర్వహించారు. ముందుగా అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీమన్ శఠకోప రంగనాథయతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులైన శ్రీ జ్వాలనృసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవార్లకు శాస్త్రోక్తంగా ఎదురుకోళ్ల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారిని మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా కళ్యాణ మండపానికి తోడ్కొని వచ్చి కొలువుంచారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ తంతు పూర్తిచేసి స్వామి, అమ్మవారికి కంకణ ధారణ నిర్వహించారు. చివరగా స్వామి, అమ్మవార్ల పాదాల వద్ద ముత్యాల తలంబ్రాలు పోసి కల్యాణ మహోత్సవాన్ని ముగించారు.



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



పొన్నచెట్టు వాహనంపై ప్రహ్లాదవరదస్వామి